క్లుప్తంగా

నేడు గిరిజన గూడెంలో వైద్యశిబిరం

పుల్లలచెరువు: మండలంలోని గారపెంట గిరిజన గూడెంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆరోగ్యమిత్ర ఆచారి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. ఐటీడీఏ, ఆరోగ్య శ్రీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమీప ప్రాంతాల్లోని గిరిజనులు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆడిట్ రికవరీపై దృష్టి పెట్టండి

ముండ్లమూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన రికవరీ సొమ్ముపై సిబ్బంది దృష్టి పెట్టాలని ఎంపీడీఓ హనుమంతరావు కోరారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఆడిట్ సందర్భంగా సుమారు ఎనిమిది లక్షల రూపాయల రికవరీని గుర్తించామన్నారు. ప్రస్తుతం ఉద్యోగంలో ఉన్న వారు తిరిగి చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీలకు సంబంధించి ఇళ్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు 92 రోజుల పే మెంట్ వెంటనే చేయాలన్నారు. ఏపీఓ మురళి, టీఏ బలరామయ్య, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

చందవరంలో పోషకాహార మాసోత్సవాలు

దొనకొండ: మండలంలోని చందవరంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి ఆధ్వర్యంలో గురువారం పోషకాహార మాసోత్సవాలు అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించారు. పోషకాహార మాసోత్సవం గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు. ఎంపీఎస్ఎస్ సూపర్‌వైజర్ ప్రభావతిదేవీ, ఏఎన్ఎం మార్గరేట్, ఏఎస్ఎస్ఏ దీనా, కార్యకర్త వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గేమ్స్ విజేతలకు అభినందనలు

దొనకొండ: నియోజకవర్గం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ దర్శి మోడల్ స్కూల్‌లో గురువారం నిర్వహించారు. దొనకొండ కేజీబీవీ బాలికలు పాల్గొన్నారు. విజేతలను వ్యాయామ ఉపాధ్యాయురాలు కళ్యాణి అభినందించారు.

సాగులో అవరోధాలు అధిగమించాలి

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులు సాగులో వచ్చే అవరోధాలను గుర్తించి సంప్రదాయ పద్ధతులకు మెళకువలు జోడించి సాగులో ముందుకు సాగాలని దర్శి సమాయ వ్యవసాయ సమాయకులు కె. బాలాజీనాయక్ అన్నారు. శివరామపురంలో క్షేత్ర పర్యటనలో భాగంగా చిరుధాన్యాలపై పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ప్రతి దశలోనూ పైరుపై నూతన సాంకేతిక పద్ధతులను వినియోగించాలన్నారు. తెగుళ్ల నివారణకు విచక్షణా రహితంగా అధిక మోతాదులో పురుగు మందులు వాడరాదన్నారు. ఏఓ ప్రసాదరావు, వీఏఏ రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

అంకాళమ్మ గుడి వద్ద విద్యుత్ లైన్ ఏర్పాటు


పూజలు చేస్తున్న ఎంపీపీ తులశమ్మ

కంభం: మండలంలోని హజరత్ గూడెం గ్రామంలోని అంకాళమ్మ గుడి వద్ద రూ.1.73 లక్షల మండల పరిషత్ నిధులతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, పది విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ తెలిపారు. పనులు పూర్తి కాగా గురువారం పూజా కార్యక్రమాలు నిర్వహించి లైట్లు వేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తులశమ్మను, ఎంపీడీఓ ప్రసాద్‌బాబును శాలువాలతో సన్మానించారు. సర్పంచ్ మహబూబ్ పీరా, వైస్ ఎంపీపీ హసీనా, చేగిరెడ్డి ఓబుల్ రెడ్డి, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి


చెన్నంపల్లి పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో

పుల్లలచెరువు: పాఠశాలలో రికార్డులు ఉపాధ్యాయులు సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో శామ్యూల్‌జాన్ అన్నారు. గురువారం మండలంలోని చెన్నంపల్లి పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన రికార్డులు అన్నీ సక్రమంగా ఉండాలన్నారు. విద్యార్థు వర్క్ పుస్తకాలు రోజూ తనిఖీ చేయాలన్నారు. వారికి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఎంఈవో–2 ఇందిరాప్రసాద్ యండ్రపల్లి పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

శరణు శరణు గణేశా..


నాయుడుపేట ఎస్సీ కాలనీలో..


తర్లుపాడులో గణేష్‌రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడు


బేస్తవారిపేట: నిమజ్జనానికి తరలిస్తున్న వినాయక విగ్రహం

మార్కాపురం: గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఊరూ వాడా వేడుకగా సాగుతున్నాయి. గురువారం మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో కమలా హ్యాపీ హోమ్స్, నెహ్రూ బజారు, రాజాజీ వీధి, అమ్మవారిశాల బజారు, తూర్పువీధి, ఎస్టేట్, పూల సుబ్బయ్య కాలనీ, వడ్డే బజారు తదితర ప్రాంతాల్లో గణేశుడి విగ్రహాలను సుందరంగా ముస్తాబు చేసి పూజలు నిర్వహించారు. రాత్రి వేళ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కమలా హ్యాపీ హోమ్స్‌లో గణేశుని పూజలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ పెనుగొండ కేశవరావు, కనుమర్లపూడి వెంకటేశ్వర్లు, డాక్టర్ పిచ్చిరెడ్డి, శ్రీకాంత్, ఆర్‌వీ సుబ్బారావు, గెల్లి సుబ్రహ్మణ్యంతోపాటు పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరునికి విశేష పూజలు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడుతోపాటు మీర్జపేట, చెన్నారెడ్డిపల్లి, నాగేళ్లముడుపు, తాడివారిపల్లి, కలుజువ్వలపాడు, జగన్నాథపురం, తుమ్మల చెరువు, బుడ్డపల్లి, కేతగుడిపి, సీతానాగులవరం, పోతలపాడు, గానుగపెంట, ఓబాయపల్లి, సూరేపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలకు భక్తులు విశేష పూజలు చేశారు. మండపాల వద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తర్లుపాడు మెయిన్‌బజారులోని వినాయకుని మండపం వద్ద గణేష్‌రెడ్డి యూత్, మండలంలోని పలు గ్రామాల్లో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జనం

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుని విగ్రహాలను నాలుగో రోజు గురువారం భక్తుల కోలహలం నడుమ నిమజ్జనం చేశారు. నాయుడుపేట ఎస్సీ కాలనీలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గణేశ్ లడ్డూ వేలంలో పలువురు భక్తులు పోటీపడ్డారు. గొట్లగట్టులో భక్తులకు అన్నదానం చేశారు.

బేస్తవారిపేట: ఐదు రోజులుగా మండపాల్లో పూజలందుకున్న గణనాథుడిని గురువారం నిమజ్జనానికి తరలించారు. బేస్తవారిపేటలోని బీసీ కాలనీ, రాణిపేట, నెహ్రూబజార్, పాత పోస్టాఫీసు వీధి, శుభోదయ హైస్కూల్ వీధి, సోమవారిపేట గ్రామాల్లోని వినాయక విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై ఉంచి తప్పెట్లు, మేళతాళాలు, బాణసంచా కాల్చుతూ కంభం చెరువు, కోనకు తీసుకెళ్లారు. ఎస్‌ఐ కోటేశ్వరరావు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఐ

గణపతి నవరాత్రుల సందర్భంగా ముగ్గుల పోటీలు

యర్రగొండపాలెం: గణపతి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్ వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 20 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. యువజన సంఘ నాయకులు రెడ్డి నరసింహ, కొత్తమాసు హరీష్, పొట్టి రవికుమార్, భవనాశి విజయబ్రహ్మం పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండలంలోని వేముల, శ్రీనివాస నగర్‌లో వినాయక విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. శ్రీనివాసనగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. సూదిదేవర అంజయ్య, బంకా నాగిరెడ్డి, మేగడం వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.


ఉట్టి కొట్టే కార్యక్రమంలో కాలనీ వాసులు


మార్కాపురంలో గణేశుడికి పూజలు చేస్తున్న మహిళలు


ముగ్గులు వేస్తున్న మహిళలు

రబీ పంటల సాగుకు రైతులు సిద్ధం


పంటల సాగుకు సిద్ధం చేసిన భూమి


మిర్చి సాగుకు సాళ్లు తీస్తున్న రైతన్న

కొనకనమిట్ల: రబీ సాగుకు రైతులందరూ ఉత్సాహంగా పొలం పనులు మొదలుపెట్టారు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో భూములు పదునెక్కాయి. దీంతో రైతులు పొలాల్లో దుక్కులు దున్ని సాగుకు సమాయత్తం అవుతున్నారు. పొలంలో చెత్తా చెదారాన్ని తొలగించే పనులతోపాటు పశువుల ఎరువులు తోలడం, దుక్కి దున్నడం, భూములు చదునుచేయడంలో నిమగ్నమయ్యారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా అధికారులు సరఫరా చేస్తున్నారు.

రైతుల్లో ఉత్సాహం..

ఇటీవల వర్షాలు పడటంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, కంది, పొగాకు పంటలతోపాటు ఉద్యాన పంటలు కళకళలాడుతున్నాయి. మరో దఫా వర్షం పడితే వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాలలో మిర్చి, వరి సాగుతోపాటు పొగాకు నాట్లు ప్రారంభించారు.

రైతుల చెంతకే విత్తనాలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. విత్తనాలు సరఫరా చేసేందుకు రైతుల వివరాలు నమోదు చేస్తున్నాం. మండల వ్యాప్తంగా 18 రైతు భరోసా కేంద్రాల్లో డిజిటల్ కియోస్కు మిషన్ల ద్వారా విత్తనాలు, ఎరువులు కావాల్సిన రైతులు కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని విలేజ్ డిజిటల్ అసిస్టెంట్ వద్ద నగదు చెల్లించాల్సి ఉంటుంది. తదుపరి విత్తనాలను నేరుగా రైతులకు అందిస్తాం.

– ప్రసన్న రంగలక్ష్మి, ఏఓ

పల్లెవనం పార్కు పరిశీలన

దర్శి: దర్శి పల్లెవనం పార్కును గురువారం ప్రారంభించారు. గత ఎనిమిది నెలలుగా పార్కు మరమ్మతులు చేస్తున్నామని చెప్పి పార్కును మూసివేసిన సంగతి తెలిసిందే. అయితే గురువారం పార్కు తెరుచుకోవడంతో ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ సునీత పార్కును సందర్శించారు. గతంలో పార్కులో జరిగిన రూ.40 లక్షలు కేటాయించగా ఏర్పాటు చేసిన వసతులు పరిశీలించారు. గ్రానైట్ స్టేజీలు, ఆట వస్తువులు పరిశీలించారు. ప్రతిరోజూ పార్కును తీసి ఉంచతామని చెప్పారు. ఎఫ్ఆర్ఓ నాగేంద్రరావు, ఎఫ్ఎస్ఓ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


పల్లెవనం పార్కును పరిశీలిస్తున్న డీఎఫ్ఓ సునీత

సర్వే జాగ్రత్తగా నిర్వహించాలి

హనుమంతునిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జాగ్రత్తగా నిర్వహించాలి డాక్టర్ ప్రతాపురెడ్డి, డాక్టర్ సందీప్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే ముప్పాళ్లపాడులో గురువారం నిర్వహించారు. సర్వేను వైద్యాధికారి పర్యవేక్షించారు. అనంతరం సాయంత్రం పీహెచ్‌సీలో నిర్వహించి క్లస్టర్ సమావేశంలో వైద్యులు పాల్గొని మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్య క్యాంపులు వచ్చే నెల 3వ తేదీ నుంచి జరుగుతాయన్నారు. ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటికి సందర్శించాలన్నారు. ఇంటింటి సర్వేలో గుర్తించిన వారికి కార్పొరేట్ స్థాయి వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి


జెండా ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

దర్శి: క్రీడాకారులు ఆటల పోటీల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని ఎంఈఓ కాకర్ల రఘురామయ్య అన్నారు. స్థానిక మోడల్‌స్కూల్ ప్రాంగణంలో గురువారం నియోజవర్గ స్థాయి క్రీడా పోటీలు, సెలక్షన్‌లు ఘనంగా నిర్వహించారు.

అదుపుతప్పిన కారు



తర్లుపాడు: కారు అదుపు తప్పి రోడ్డు పక్కన గోతిలో పడిపోయిన సంఘటన గురువారం రాత్రి తర్లుపాడు శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. తర్లుపాడు ఎస్సై వి.సుధాకర్ కథనం మేరకు.. మార్కాపురం నుంచి తర్లుపాడు మీదుగా వస్తున్న కారు స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. దీంతో కారు నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని కారు నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం 108 వాహనంలో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడి వివరాలు, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

40 వాహనాలకు జరిమానా

పామూరు: నిబంధనలను అతిక్రమించి అధికవేగంతో వెళ్తున్న 40 వాహనదారులకు రూ.40 వేల జరిమానా విధించినట్లు దర్శి ఎంవీఐ పరిశపోగు రవికుమార్ తెలిపారు. 565 జాతీయ రహదారిపై బుధ, గురువారాల్లో స్పీడ్‌గన్‌తో వాహనాల వేగాన్ని తనిఖీచేసి అతివేగంగా వెళ్తున్న వాహనదారులకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అతివేగం ఎంతో ప్రమాదకరమని, మితిమీరిన వేగం వల్లే తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు నిబంధనలను పాటిస్తూ, లైసెన్స్ కలిగిఉండి వాహనాలను నడిపి సురక్షిత ప్రయాణాలు సాగించాలన్నారు.


అవగాహన కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు

మార్కాపురం టౌన్: విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవడం అవసరమని, అంతర్జాతీయ సంస్థలు నైపుణ్యాలనే ప్రామాణికంగా తీసుకుని ఉద్యోగావకాశాలు ఇస్తాయని స్కిల్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్, నంద్యాల టీమ్ మెంబర్ జి.మనోహర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సాధనా డిగ్రీ కళాశాల క్యాంపస్ రిక్రూట్‌మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్పీడ్ అండ్ యాక్టివ్ లెర్నింగ్ టెక్నిక్‌లను విద్యార్థులకు వివరించారు. విప్రో, ఇన్ఫోసిస్, టీసీఎస్ లాంటి పెద్ద కంపెనీల్లో ఉద్యోగం సాధించాలంటే డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే మంచి ప్రణాళికతో నైపుణ్యాలను అలవర్చుకుని, సాధన చేయాలని సూచించారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్, ట్రైనింగ్ విభాగం కోఆర్డినేటర్ కె.పవన్‌కుమార్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే ఈ అవగాహన కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధుసూధనశాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోరుతూ రాస్తారోకో

మార్కాపురం: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టి అమలు చేయాలని ఎమ్ఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పందీటి కాశీరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ డిమాండ్ చేశారు. గురువారం రాయవరం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో వర్గీకరణ కోరుతూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోనికి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేసి తీరుతామని చెప్పారని, ఏళ్లు గడుస్తున్నా హామీ అమలు చేయలేదని విమర్శించారు. పార్లమెంటులో తక్షణమే బిల్లు ప్రవేశ పెట్టకుంటే వచ్చే ఎన్నికల్లో మాదిగల సత్తా చాటుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కిశోర్, పాపయ్య, ఫిలిప్, రాకేష్, అక్కులయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రెండు రోజుల్లో ఆక్రమణలు తొలగించాల్సిందే

● టౌన్ ప్లానింగ్ అధికారి మల్లికార్జునరావు

పొదిలి: ఆక్రమణల తొలగింపు కోసం నగర పంచాయతీ అధికారులు ఎట్టకేలకు కదిలారు. కలెక్టర్ స్పందన కార్యక్రమంలో కేవీ రమణారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, వై.వెంకటేశ్వరరావు తదితరులు ఆక్రమణలతో ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆక్రమణలు వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ డానియేల్ జోషెఫ్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆక్రమణలకు గురైన రోడ్డును అధికారులు పరిశీలించారు. రెండు రోజుల్లో స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని, లేదంటే తామే తొలగిస్తామని టౌన్ ప్లానింగ్ అధికారి మల్లికార్జునరావు స్పష్టం చేశారు.


స్థానికులతో మాట్లాడుతున్న మల్లికార్జునరావు

మార్కాపురం ఆర్ఐగా సుబ్బారావు

మార్కాపురం టౌన్: మార్కాపురం తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా రావిపాటి సుబ్బారావును నియమిస్తూ కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ నుంచి నియామకపత్రం అందుకున్నారు. గత నెల రోజులుగా ఆర్ఐ పోస్టు ఖాళీగా ఉంది. సుబ్బారావు ఇప్పటి వరకు సబ్‌కలెక్టర్ సేతుమాధవన్‌కు సీసీగా బాధ్యతలు నిర్వహించారు. రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా నూతన ఆర్ఐని కార్యాలయ సిబ్బంది అభినందించారు.


కలెక్టర్ దినేష్‌కుమార్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న సుబ్బారావు

క్రీడలతో ఐకమత్యం పెంపు


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, సర్పంచ్ పోతు రమణారెడ్డి


ఉత్సాహంగా సాగుతున్న క్రీడా పోటీలు

కనిగిరి రూరల్: క్రీడలు విద్యార్థుల్లో ఏకాగ్రత, ఐక్యతను పెంపొందిస్తాయని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. మండలంలోని కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలను గురువారం జెడ్పీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సి. విజయ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో తోడ్పాటునిస్తున్నట్లు చెప్పారు. క్రీడల్లో రాణించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరుతేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతు వెంకట రమణారెడ్డి, ఎంఈఓలు దేవిరెడ్డి రామిరెడ్డి, ఉడుముల నారాయణరెడ్డి, రాచగుండ్ల శ్రీనివాసులు, విద్యాకమిటీ చైర్మన్ మితికల శివన్నారాయణ, సర్పంచులు పాల్గొన్నారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు జరిగే స్కూల్ గేమ్స్ పోటీలు ఉత్సాహ భరితవాతావరణంలో ప్రారంభమయ్యాయి. అండర్ 14, అండర్ 17 గేమ్స్‌లో మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు సుమారు 450 మంది నియోజకవర్గ స్థాయి పోటీల ఎంపికలో పాల్గొన్నారు. ఆరు మండలాల నుంచి క్రీడా విద్యార్థులు పాల్గొన్నారు. గురువారం వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాట్మంటన్, టెన్నికాయిట్, యోగా, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. 22న శుక్రవారం ఖోఖో, త్రోబాల్, టెన్నీకాయిట్, యోగా, 23న శనివారం అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని నియోజకవర్గ కోఆర్డినేటర్ బి.కాశీ విశ్వనాథరెడ్డి తెలిపారు. పీడీలు, పీఈటీ, హజరత్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బసవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.